# దారిలో దొరికిన ప్రేమలేఖలు



\- ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## - 10 -

***ప్రియమైన నీకు..***

నేను కలల్లో బతుకుతున్నానని నీకూ తెలుసు కదూ! నేన్నిన్ను చూస్తా. నువ్వూ ఒకసారి చూస్తావు. ఆ చూపులో ఓసారి తెలిసినవారిని మామూలుగా చూస్తే వుండే పలకరింపు వుంటుంది.. మరోసారి అసలేమీకాని నిర్వికారమూ వుంటుంది.

నీ చూపు నామీద ప్రసరిస్తే అదో అద్భుతంగా భావించి ఆనాడు నా మనసు రెక్కలు విప్పుకుంటుంది. మరో రోజు అసలు నా వునికిని గమనించనట్టుగా నడిచి వెళ్ళిపోతుంటావు. అప్పుడు నా వెంపర్లాట మీద నాకే అసహ్యం పుడుతుంది.



చాలా ఆలోచించాను.. ఎంత ఆలోచించానో నీకు తెలీనే తెలీదు సరికదా, వూహించను కూడా వూహించలేవు. అసలు ప్రేమంటే ఏమిటి? పూర్వకాలపు బార్టర్ సిస్టమ్‌లాగా నేను నిన్ను ప్రేమించాను గనక నువ్వు నన్ను ప్రేమించాలా? ఇదేం పద్ధతి? సరే, అలాకాదు. మరి నువ్వు నన్ను గమనించనప్పుడు నాకెందుకు కోపమూ, ఉక్రోషమూ, నీరసమూ, దైన్యమూ వస్తున్నాయి? ప్రేమేమీ 'ఇస్తే వాయినం - పుచ్చుకుంటి వాయినం' లాంటిది కాదే ఏమో, నిన్న ఓ నడివయస్సామె తన కొడుకుతో, "ఎంత ప్రాణంగా పెంచానురా నిన్నూ.. కృతఘ్నుడా.. పెళ్ళాం కొంగు పట్టుకు తిరుగుతూ తల్లిమాటల్ని పెడచెవిన పెడతావా?" అని తిట్టడం విన్నా.

ఏం? బిడ్డని కనిపెంచినప్పుడు ఆవిడ ఆనందం పొందలేదా? ప్రాణంగా పెంచింది గనక ప్రాణం పోయేవరకూ తల్లిమాట వాడు వినితీరాలా?

బంగారూ..! అసలు నా మనసేమిటో, అదిపడే బాధేమిటో కూడా నాకు తెలియడంలేదు. ప్రేమేదైవం - ప్రేమేసర్వం అంటారు పెద్దలు. సర్వం 'ప్రేమ' ఎలా కాగలదూ? కాలేదని నా పేదరికం చెబుతోంది. ప్రేమ గొప్పదే. ప్రేమ బలమైనదే. కానీ ప్రాణమా.. ప్రేమలానే ఆకలీ బలమైనదే. ఎంత బలవంతుడ్నైనా బలహీన పరిచి భిక్షకుడిగా మార్చేదే

ఇంతకీ నాకేం కావాలీ? నువ్వా? సరే నాదానివైపోతావు.... ఆ తరవాత? పెళ్ళీ, పిల్లలూ వాళ్ళ పిల్లలూ వాళ్ళ పిల్లలూ! కదూ.! కానీ, అలా జరగదు.

ప్రేమలో బాధ్యతలూ వుండవు.. బరువులూ వుండవు. హక్కులూ వుండవు.. హద్దులూ వుండవు.

కానీ ఇద్దరు ప్రేమికులు పెళ్ళి చేసుకున్న మరుక్షణమే ప్రేమకి తెరపడిపోతుంది. భార్యగా నీకూ, భర్తగా నాకూ హక్కులు వస్తై. బాధ్యతలు వస్తై. నన్ను నిలదీసే హక్కు వివాహ వ్యవస్థ భార్యగా నీకిస్తే, నిన్ను విసుక్కునే హక్కు భర్తగా యీ వ్యవస్థ నాకిస్తుంది. ఈ కొత్తగా వొచ్చిన హక్కు, బాధ్యతలు ప్రేమని మింగేస్తాయి. అందుకేనేమో ప్రేమ వివాహాలు చాలామటుకూ విఫలమయ్యేది.

సరే. అసలు ప్రశ్న ఏమంటే నాకేంకావాలీ? నువ్వా? నిన్ను నేను ప్రేమిస్తున్నానా? లేక, నిన్ను ప్రేమిస్తున్నాననే భావనని ప్రేమిస్తున్నానా? తెలీదు.. అంటే, స్పష్టంగా తెలీదు.

ఏ క్షణంలో నిన్ను మొదటిసారి చూశానో నాకు నిజంగా గుర్తులేదు కానీ, ఏ క్షణమూ నీ తలపులేకుండా గడవడం లేదని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఈ 'స్మరణ'నే ప్రేమ అంటారా? ఏమో!

ప్రతిక్షణమూ అనిపిస్తుంది.. నా హృదయాన్ని అక్షరాలుగా మార్చి నీ కళ్ళ ఎదుట పరుద్దామని.

కానీ నేస్తమా, ఆ పని చెయ్యలేను. ఎందుకో తెలుసా? నేనేనాడూ కలలో కూడా నిన్ను బాధపెట్టలేను. హక్కు సంగతి అవతల పెట్టు.. గుండెలో నిన్ను కూర్చోపెట్టిన సింహాసనం నించి ఏనాడూ కిందకి దింపలేను. అందుకే.. రాసిన ప్రతి లేఖా నా కళ్ళల్లో ఒదిగి చెమ్మగా మారిపోతోంది. అసంఖ్యాకమైన ఆలోచనలు శూలాల్లా నా మనసుని తరుముతున్నాయి. నీ ఒడి చేర్చుకుని నన్ను సేద తీర్చవా....!?



నీ

-X-

(వచ్చేనెల మరో ప్రేమలేఖ)

Post your comments